Mushtarika Khandani Nizaam Aur Islam
(Telugu)

ఉమ్మడి కుటుంబం - ఇస్లామ్

మూలం
మౌలానా సుల్తాన్ అహ్మద్ ఇస్లాహి

అనువాదం
ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

విషయసూచిక

1. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ వలన నష్టాలు 06

2. లైంగిక అసంతృప్తి 07

3. సామాజిక కోణం 08

4. కుటుంబ బాధ్యతల నిర్వహణ 09

5. ఆర్థిక కోణం 09

6. విధిలేని అసమానత్వం 11

7. వ్యక్తిత్వ నిర్మాణంలో అవరోధం 11

8. పరస్పర సంబంధాల అపసవ్యత 12

9. ఇస్లాం కోరే కుటుంబ వ్యవస్థ 14

10. ప్రవక్త సంప్రదాయం 16

11. ఆదాయాలు కూడా వేర్వేరే 16

12. భార్య నివాస హక్కు 19

13. పరదా చాటునుండి అడగటం 28

14. ఆదాయ విభజనకు సంబంధించిన కొన్ని కోణాలు...... 33

ఇస్లామిక్ పోస్టల్ లైబ్రరీ

ఇస్లాం ధర్మ బోధనలను తెలుసుకొనే అద్భుత అవకాశం

తెలుగు మరియు ఇంగ్లీషు భాషల్లో

- ఇస్లాం కోరేదేమిటి?
- మరణానంతర జీవితం గురించిన వాస్తవాలు
- మహిళల ప్రాథమిక హక్కులు
- దివ్యఖుర్ఆన్ బోధనలు
- దేవుని ఉనికికి ఆధారాలు
- తలాఖ్, ఖులా, ముస్లిం పర్సనల్ లా మొదలైన వాటి వాస్తవ సమాచారం

▶ ఇలాంటి ఇంకా అనేక అంశాలు, సమస్యలు, సందేహాలకు ఇస్లామీయ సమాధానాలు తెలుసుకోవడానికి - సంప్రదించండి.

కేవలం ఒక్క పోస్టుకార్డు వ్రాసి ఇస్లామీయ సమాచారం ఉన్న అనేక పుస్తకాలను పోస్టుద్వారా ఉచితంగా చదవండి.

▶ మీరు ఏ మతాన్ని అవలంబిస్తున్నవారైనా, మీరెలాంటి ధార్మిక విశ్వాసాన్ని కలిగివున్నా, ఏ ప్రాంతానికి చెందినవారైనా - ఈ ఉచిత సౌకర్యంతో ప్రయోజనం పొందండి.

(నేడే వ్రాయండి:)

ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్

సందేశభవనం, లక్కడ్‌కోట్, ఛత్తాబజార్, హైదరాబాద్-500 002.

అనంతకరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

భారత ఉపఖండంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ (Joint- family System) దాని ప్రాముఖ్యం, ఔన్నత్యాల భావన ఒక అంగీకృత విషయం. ఉమ్మడి కుటుంబాలైతే సుఖసంతోషాలకు చిహ్నాలుగా, చిన్న కుటుంబాలైతే కష్టనష్టాలకు, దుఃఖానికి ఆనవాలుగా పరిగణించడం జరుగుతుంది. దీనికి రెండు మౌలిక కారణాలున్నాయి.

పెత్తనం చెలాయించాలన్న కోరిక

మొట్టమొదటి మౌలిక కారణం పెత్తనం చెలాయించే కోరిక . ప్రతి యుగం, ప్రతి కాలంలో వ్యక్తిగత శక్తికి అసాధారణ ప్రాముఖ్యంఉంది. నేటి కాలంలో కూడా ఈ ప్రాముఖ్యతను యధాతధంగా అంగీకరించడం జరుగుతోంది. అంగబలం ఎవరివద్ద ఎక్కువ గా ఉంటుందో , అతనికే పెత్తనం, అధికారం దక్కుతుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత జీవన నేపథ్యంలో ఈ ప్రాముఖ్యతను మనం మరింత సులభంగా అంచనా వేయవచ్చు. అర్థం చేసుకోవచ్చు. ఆప్రాంతాల్లో 'కఱ్ఱ గల వాడిదే బఱ్ఱె' అన్న సామెత అక్షరాలా ఆచరణ రూపం దాల్చుతుంది. వ్యవసాయాధారిత ప్రాంతాలు ఉమ్మడి కుటుంబ వ్యవస్థను తమ ప్రాణప్రద అవసరంగా భావిస్తాయి.

ఆస్తి కేంద్రీకరణ

ఇలాంటి సామాజిక వ్యవస్థకు రెండవ మౌలిక ప్రేరణ సంపదను కూడబెట్టుకోవాలన్న కోరిక. ఇలాంటి వ్యవస్థను అభిలషించడమే కాదు, అవసరమని భావించే గ్రామీణ జీవన నేపథ్యంలో భూమి, వ్యవసాయానికి

అత్యంత ప్రాముఖ్యం ఉందన్న విషయం అందరికీ తెలిసిందే. ఈనాడు కూడా భూమి ఇతర సంపదల ప్రాముఖ్యం తక్కువేమీకాదు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ దృష్టిలో లక్ష్యసాధనకు ఒకే ఒక సూత్రం ఉంది. అదేమిటంటే విస్తరించిన ఉమ్మడి కుటుంబంపై ఒకే వ్యక్తి అధికారం సాగాలి. తండ్రి కుటుంబ పెద్దగా కొనసాగుతూ పనులన్నీ చక్క బెడతాడు. ఒక్కోసారి అతడు తన జీవిత కాలంలోనే సాధారణంగా పెద్ద కొడుకు తన వారసుడి గా నిర్ణయిస్తాడు.

ఈ విధమైన సామాజికవ్యవస్థ తన మూలం దృష్ట్యానే అజ్ఞానంతో కూడుకొని ఉంది. మున్ముందు తండ్రి తరువాత అతని పెద్ద కొడుకును అతడి పూర్తి ఆస్తికి ఏకైక వారసుడిగా, చిన్న కొడుకులందరినీ అన్ని రకలుగా అతడి పై ఆధారపడేవారు (Dependents)గా నిర్ణయిస్తుంది. (మనస్మృతి 9వ అధ్యాయం- 105,108 లాలా స్వామి దయాళ్)

ఇస్లామ్‌కు పూర్వం అరేబియాలోని అజ్ఞాన సమాజంలో కూడా ఈ విధమైనటువంటి సామాజిక వ్యవస్థనే కోరుకోవడం జరిగేది. ఈ వ్యవస్థలో తండ్రి మరణానంతరం అత్యంత దౌర్జన్యంగా అతని భార్య, అతని మిగిలిన సంతానానికి అతడు వదిలివెళ్ళిన ఆస్తి ఏమాత్రం దక్కనిచ్చేవారుకాదు. తండ్రి మరణానంతరం అతని యావదాస్తికి ఏకైక వారసుడు అతడి పెద్దకుమారుడే అయ్యేవాడు.

(జామి ఉల్ బయాన్,4/142, యమానా ఈజిప్ట్)

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ వలన నష్టాలు

ఏకాంతానికి సంబంధించిన సమస్య

ఈ వ్యవస్థలో అన్నిటికంటే పెద్ద లోపం మానవ నైజానికి సంబంధించినది. ఏకాంతం అన్నది మానవ నైజంలోనే ఇమిడి ఉంది. ఈ

కారణంగానే ప్రతి స్వేచ్ఛా జీవి తన కోసం ప్రత్యేకంగా ఒక ఇల్లు, ఇతర సౌకర్యాలూ కోరుకుంటాడు. ఈ సదుపాయాలు అతనికి చేకూరకపోయి నట్లయితే అతడు మనఃశ్శాంతి లేక అశాంతికి గురవుతాడు. ఎప్పుడూ అతడు ఏదో పోగొట్టుకున్నవాడిలా అశాంతి, అభద్రతల వాతావరణంలో కాలం గడుపుతాడు. ఉమ్మడి కుటుంబంలో అతడికి తాను కోరుకున్న ఏకాంతం, ఏకాగ్రతా ప్రాప్తంకావు. అతణ్ణి నిరంతరం అశాంతి వెంటాడుతూ ఉంటుంది.

లైంగిక అసంతృప్తి

లైంగిక అసంతృప్తికి సంబంధించిన కోణం కూడా ఇందులో ఇమిడి ఉంది. ప్రత్యేకించి ఇస్లాం దృష్టిలో దీనికి ఎనలేని ప్రాముఖ్యం ఉంది. ఇస్లాం వివాహం చేసుకోకుండా, అక్రమ సంబంధం కలిగి ఉండడాన్ని అత్యంత ఘోరమైన దుర్మార్గంగా భావిస్తుంది. అటువంటి అక్రమ సంబంధం పెట్టుకున్న వారికి చాలా కఠినమైన శిక్షకు గురి చేస్తుంది. అయితే దీంతోపాటే అది ధార్మిక పరిధిలో సంపూర్ణ, ఆనందమయ లైంగిక జీవితానికి అనుమతినిస్తూ, దానికి కావలసిన ఏర్పాట్లు చేస్తుంది.

ఉమ్మడి కుటుంబంలో లైంగిక జీవితానికి సంబంధించిన ఇస్లామీయ బోధనలను ఆచరించేందుకు అవకాశం ఉండదు. అందుకని ప్రతి వివాహితుడికి తనకంటూ ఓ ప్రత్యేక నివాసం ఎంతైనా అవసరం అని తెలుస్తుంది.

ధార్మిక కోణంలో చూసినట్లయితే, కొత్తగా పెళ్ళయిన జంటకు ఉమ్మడి కుటుంబంలో తమ నమాజులను కాపాడుకోవడం చాలా కష్టంతో కూడుకున్న పని. ఇది ఈ వ్యవస్థలో ఉన్నటువంటి మరో లోపం. యుక్త

వయసులో ఉన్న కొత్త జంట కేవలం వ్యవస్థలోని లోపం కారణంగా తమ కోరికలను బలవంతంగా అణచుకోవలసి వస్తుంది. కొత్తగా పెళ్ళయిన జంటకు ఇంతకంటే పెద్ద తలనొప్పి వ్యవహారం మరేదీ ఉండదు. ఒక్కోసారి ఇది మానసిక రుగ్మతలకు కూడా దారితీసే అవకాశాలు లేకపోలేదు. అదే వారి కోసం ప్రత్యేక నివాసం ఉన్నట్లయితే వారికీ కష్టాలు ఉండవు. గుసుల్ చేయడం, నమాజులు చేయడం వారికి సులభమవుతుంది. ఏవో కుంటి సాకులతో నమాజులు వదిలేసే బాధలు తప్పుతాయి. ఎందుకంటే ఒక ముస్లింకు 'నమాజు' ఈ ప్రపంచం, ప్రపంచంలోని సమస్తం కంటే మేలైనది.

సామాజిక కోణం

సామాజికంగా చూసినా ఈ వ్యవస్థలో స్పష్టమైన అసమతౌల్యత కనిపిస్తుంది. పెద్ద కుటుంబాలు ఉమ్మడిగా ఉండడం వల్ల ఖర్చు కలిసొస్తుందని, కుటుంబంపై పెట్టే వ్యయం ఆదా అవుతుందని చాలా మంది భావిస్తారు. కాని వాస్తవం ఏమిటంటే, ఈ వ్యవస్థతో ముడిపడి ఉన్న సామాజిక అవరోధాలు, దాని దుష్ప్రభావాల ముందు ఉమ్మడి ఖర్చుల వల్ల కలిగే ప్రయోజనాలు చాలా స్వల్పం, ఉమ్మడి కుటుంబం కావడం వల్ల అందరి ఆహారం ఒకటే అవుతుంది. తనకిష్టమైన దాన్ని వదిలేసి ఉమ్మడి 'మెనూ'కు, ఆ వ్యవస్థకు బద్ధుడై పోవలసివస్తుంది. దీన్ని కాదని తన ఇష్టానుసారం తింటాననడం ఈ వ్యవస్థ గౌరవానికి వ్యతిరేకం అవుతుంది. ఒక ఆత్మాభిమానం కల మనిషి, దీన్ని ఎంతమాత్రం సహించలేడు. ఈ విషయంలో ఇల్లు ఉమ్మడిగా ఉండడం వల్ల, అందరి అవసరాలూ అక్కడే తీరాలిగనుక ఇంట్లో ఎప్పుడూ బిజీబిజీగా ఉంటుంది. రద్దీ ఎక్కువగా ఉంటుంది. అసహనం సంఘర్షణ కలుగుతుంది. మనిషి జీవితాంతం అశాంతిగా ప్లాట్ ఫారం బతుకులాంటి జీవితం గడుపుతున్నట్లు భావిస్తాడు.

కుటుంబ బాధ్యతల నిర్వహణ

అంతేకాకుండా ఈ వ్యవస్థలో సామాజిక అసమతౌల్యం, సామాజిక అసౌకర్యం కూడా మరోకారణం, ప్రధానంగా కుటుంబిక బాధ్యతల నిర్వ హణలో భర్త భార్యతో కలసి కాపురం చేయడం,ఆమె బాగోగులు చూసు కోవడం ఆమెకు అన్నివిధాలుగా సహాయ సహకారాలు అందించడం ఇస్లా మీయ బోధనల్లో, అవసరాల్లో అతి ప్రధానమైనది. ఇస్లాం ప్రసాదించి నటువంటి కుటుంబ వ్యవస్థలో భార్య పట్ల ప్రేమ, సానుభూతి, సత్ప్రవర్తన ప్రధానమైనభాగాలు, అంటే పిల్లల ఆలన పాలనలో, ఇంట్లోని ఇతర అవసరాల్లో ఆమెకు సాధ్యమైనంత ఎక్కువగా సహకరిస్తూ ఆమె భారాన్ని తగ్గించడానికి ప్రయత్నిం చాలి.

మౌలిక బోధనలు మాత్రమే కాకుండా, ఈ విషయంలో దైవ ప్రవక్త (స) వారి ఆచరణ చాలా ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ప్రవక్త మహనీయులు ఇంటి పనుల్లో సహకరిస్తూ వారికి అన్నివిధాలా తోడ్పడే వారు. ఇంట్లో వారితో ప్రవక్త వారి ఆచరణ ఎలా ఉండేదని హజ్రత్ ఆయిషా(రజి అన్) ను ప్రశ్నంచగా: 'ఆయన (సం) ఇంట్లో ఉంటే ఇంటి పనుల్లో తనకు సహకరించే వారని, నమాజు వేళకాగానే మసీదు కు వెళ్ళి పోయేవారని ఆమె తెలిపారు'

(బుఖారి రెండవ సంపుటం, కితాబున్నఫఖాత్)

ఆర్థిక కోణం

ఆర్థిక పరంగా చూసినా ఉమ్మడి కుంటుంబ వ్యవస్థలో చాలా అసంతులనం గోచరిస్తుంది. సంపద ఒకే చోట కేంద్రీకృతం కావడం ఈ వ్యవస్థ ప్రధాన లక్ష్యం. కుటుంబంలో పదిమంది సంపాదించేవాళ్ళుంటే దానిపై పెత్తనం చేసే వాడు దాని సంరక్షకుడు ఒక్కడుంటాడు. వచ్చిన

ఆదాయం విషయంలో అతనికి పూర్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలుంటాయి. మనిషి తాను సంపాదించిన దాన్ని తన కొసమే ఖర్చు పెట్టు కోవాలన్నది సహజంగా మానవనైజం. తన సంపాదన తన కొసమే వెచ్చించబడాలని మానవుడు కోరుకుంటాడు. తన సంపాదనంతా ఇతరులకు ధారాదత్తం చేయడాన్ని అతను ఎట్టి పరిస్థితిలోనూ అంగీకరించడం. అది అతడి నైజానికి వ్యతిరేకం.

దీని ఫలితంగా అతడు ఇంట్లోని ఉమ్మడి కేంద్రీయ వ్యవస్థను గౌరవిస్తూ, తనసంపాదనలోని ఒక భాగం కుటుంబసంరక్షకుని చేతిలో పెట్టి మిగతాది దొడ్డిదారిన వెనకేసుకూనే ప్రయత్నంచేస్తాడు. చేతి వేళ్ళకు మాదిరిగానే దైవం ఈ ప్రపంచంలో ప్రతిమనిషికి ఉపాధినీ వేరు వేరుగా ఉంచాడు. ఈ విధంగా ఉమ్మడి కుటుంబంలో ఉంటూ అదే ఇంట్లో విభిన్న ఆర్థిక స్థాయిలతో పాటు ఒక్కటిగా ఉంటూనే ఎవరికి వారు వేరు వేరుగా ముందుకు పోవడానికి ప్రయత్నిస్తుంటారు. నేడు కాక పోతే రేపైనా ఈ ప్రకృతి విరుద్ధ మైన వ్యవస్థ పేక మేడలా కుప్పకూలినప్పుడు జూదంలో గెలుపోటములకు లాగా ఒకడి జేబు నిండితే, వేరొకడి జేబుకు చిల్లులు పడినట్లు జేబులు మిగులుతాయి.

ఉమ్మడి కుటుంబాలు, ఆ కుటుంబాల్లోని చాలామందిని అసమర్ధులుగా తయారు చేయడానికి కూడా తోడ్పడతాయి. వారు సంపాదనా రంగానికి దూరంగా ఉంటారు. నేటి ఆధునిక మేధావులు కూడా ఉమ్మడి కుటుంబ వ్యవస్థ వ్యక్తి అభివృద్ధికి, వికాసానికి అడ్డగా నిలుస్తుందని, అతని సంపాదనా పటిమను అణిచి వేస్తుందని, బాద్యతా భావానికి అది అవరోధంగా నిలుస్తుందని అంగీకరిస్తున్నారు. అయితే ముఖ్యంగా ఈ ఆధునిక కాలంలో ఏదేశమైనా సాంకేతిక పారిశ్రామికంగా ప్రగతి సాధించాలంటే, ఈమేధావులు అంగీకరించిన విషయాన్ని పాటించడం అవసరం (Life and conditions of the people Hindustan.p 168)

విధిలేని అసమానత్వం

బయటికి రాగానే ఇంట్లో కూడా కాస్త డబ్బులున్న వాడిని ఇతరుల కన్నా ఎక్కువగా గౌరవించడం జరుగుతుంది. సంపాదనాపరుణ్ని ఇంట్లో వాళ్ళు అందరూ నెత్తిన కూర్చొపెట్టుకుంటారు. ఉమ్మడి కుటుంబంలో పేరుకు ఎవరు పెద్ద అయినా,ప్రత్యేకించి సంపాదించేవాణ్ని చాలా గౌరవభావంతో చూడడం జరుగుతుంది. ప్రతి విషయంలో అతడికి పెద్దరికపు హోదాదక్కుతుంది. ఎవరి సంపాదన ఎంత ఎక్కువ ఉంటే ఉమ్మడికుటుంబంలో అతని కలాంటి గౌరవమే దక్కుతుంది. ఈ గౌరవం, ఈ పెద్దరికం అధికారం అతడితోపాటు అతడి భార్యా పిల్లలకు కూడా తప్పకుండా సంక్రమిస్తుంది. ఈ విధంగా బాహ్యంలో పేరుకు సమానత్వం, గొప్పల ప్రగల్బాలు వ్యక్తమవుతున్నా లోలోపల చాపకిందనీరులా పాకుతూ అసహాయత అసమానత్వం ప్రబలుతూ ఉంటుంది. చివరికి ఇంట్లో సంపాదనాపరులు కాని పురుషులతో పాటు వారి భార్యాబిడ్డలు కూడా నిరాదరణకు గురై రెండవతరగతి పౌరులుగా, ఇంట్లో కూడా సూటిపోటి మాటలకు గురికావలసి వస్తుంది. ఒక్కో సారి పరిస్థితి శృతి మించి వీరు కూలీలు, బానిసలకంటే హీనంగా చూడబడతారు.

వ్యక్తిత్వ నిర్మాణంలో అవరోధం

ఒక మనిషివ్యక్తిత్వ నిర్మాణంలో సమాజం, వాతావరణ ప్రభావం అసాధారణంగా ఉంటుంది. పరిస్థితులు అనుకూలిస్తే, సమాజంసహకరిస్తే బలహీన వ్యక్తిత్వాలు సైతం అప్రతిహతంగా శరవేగంతో వికసిస్తాయి. కాని పరిస్థితులు అనుకూలించక, వాతావరణం సహకరించకపోతే ఒక్కోసారి అత్యున్నత వ్యక్తిత్వాలు సైతం ఏ మాత్రం వికసించక ముడుచుకు పోతాయి. కొన్ని ఉదాహరణలు మినహాయింపు ఉంటే ఉండవచ్చు. కాని,

సాధారణంగా మనిషి 95% పరిస్థితులకే ప్రభావితుడవుతాడు. ఈ పరిధినుండి అతడు బయటికి వెళ్ళడంగాని, ఆ ప్రభావాన్ని స్వీకరించ కుండా ఉండడంకాని అసాధ్యం. ఈ నేపథ్యంలో కొన్ని సార్లు ఇంటి ఆర్థిక పరిస్థితి ఎంత పటిష్టంగా ఉన్నప్పటికీ ఒక మనిషి ఉమ్మడి కుటుంబంల్లోని విధిలేని పరిస్థితులు పరస్పర సంఘర్షణల ఫలితంగా చాలా మంది కుటుంబ సభ్యులు తమ కోరికలను అణచుకోవడం తప్ప గత్యంతరంలేని స్థితి ఉంటుంది. ఆర్థిక సమస్యల చూచి, అసమానతల భూతాన్ని చూపించి తెలిసి, కావాలని చాలా మంది పసిబాలలను కేవలం పరస్పర విరోధం కారణంగా చదువుకు దూరంచేసి డబ్బు సంపాదించే యంత్రాలుగా మార్చి వేయడం జరుగుతుంది.

పరస్పర సంబంధాల అపసవ్యత

ఈ వ్యవస్థలో ఉన్నటువంటి మరో పెద్ద లోపం ఏమిటంటే పరస్పర సంబంధాలు చెడిపోవడం. కొంత మందితో కలసి కొన్నాళ్ళ పాటు ఒకే చోట ఉండడం వల్ల మనిషికి ఒకవిధ మైన విసుగు జనిస్తుంది. ఇది మానవ నైజం, ఇళ్ళు వేర్వేరు అయినప్పటికీ ఒకే చోట కలసి ఉన్నప్పుడు ఏదో ఒక స్థాయిలో ఇలా జరుగుతుఉంటుంది. ఈ మానసిక బలహీనతతో పాటు కుటుంబాలు కూడా కలిసి ఉన్నట్టయితే విసుగు పుట్టించే కారణాలకు మరింత బలం చేకూరుతుంది. దీని ఫలితంగా ప్రతి చిన్నమాటకూ పెడార్థాలు వెదకడం, పంతాలు పట్టింపులు అధికమై ఒకరంటే ఒరికి గిట్టని పరిస్థితులు ఏర్పడతాయి. ఇంటి పెద్దగా తండ్రి సమక్షంలోనైనా, లేక అతనితరువాత నైనా ఇంట్లోని పురుషులు రక్త సంబంధాల కారణంగా కలసి ఉన్నప్పటికీ, వేరే ఇళ్ళనుండి,కొత్త వాతావరణం నుండి ఆ ఇళ్ళకొచ్చే కొత్తకోడళ్ళు ఈ సంబంధాలకు కాస్తంతా అతీతంగానే, అంటీ ముట్టనట్లు ఉంటారు, ఈ కొత్త మనుషుల్ని ఉమ్మడి కుటుంబాల ప్రకృతి వ్యతిరేక

వ్యవస్థలో కృత్రిమంగా పరస్పరం ఇమిడ్చే ప్రయత్నం చేయడం వృథాప్రయాస, బలవంతపు అతుకు తప్ప మరేమీకాదు. ఇలాంటి కృత్రిమ ప్రయత్నాలు ఎన్నటికీ విజయం సాధించలేవు.

అంతేకాకుండా ఈ అసహజ, మానవ నైజానికి వ్యతిరేకంగా ఉన్నటు వంటి ఈ వ్యవస్థలో మానవ సంబంధాల అపసవ్యతకు మరో కోణంకూడా ఉంది. ముఖ్యంగా దీని సంబంధం భార్యాభర్తల సంబంధంతో ముడి పడి ఉంది. భార్యాభర్తలు పూర్వ పరిస్థితుల్లో ఒకరికొకరు అపరిచితులు, కాని నికాహ్ ఒప్పందం (Contract) ద్వారా ఒకరికొకరు జీవిత భాగస్వాములు, ఒకే దేహం, ఒకే ఆత్మ అవుతారు. అంతే కాదు వాస్తవమేమిటంటే, ఈ దాంపత్యసంబంధం ద్వారా, ఒక వేళ పూర్వమే బందుత్వం ఉన్నప్పటికీ ఆబంధుత్వ సంబంధాలన్నీ ద్వితీయ స్థానంలోకి, ఇంకా చెప్పాలంటే తెరమరుగైపోతాయి. దాంపత్య సంబంధం అన్ని సంబంధాలను వెనక్కునెట్టి ప్రధమస్థానాన్ని ఆక్రమిస్తుంది. ఇద్దరు అపరిచితుల్లో మెగ్గతొడిగిన ఈ సమీప బంధుత్వం బహుశా ఇతర అన్ని మానవసంబంధాల్లో అత్యంత సున్నితమమైనది. అందుకే ప్రధానంగా ఇస్లాంలో భార్య భర్త పట్ల,భర్త భార్య పట్ల అత్యంత శ్రద్ధా సక్తులు కలిగి ఉండాలని ఒకరి మనసును ఒకరు నొప్పించుకోనే అన్ని చర్యలకు దూరంగా ఉండాలని హితువు గరపడం జరిగింది.

'ఒక ఆత్మ రెండు దేహల్లా' ఉన్నప్పటికీ అపరిచిత తెర, ఈ సంబంధం ప్రత్యేకత దృష్ట్యా భార్యా భర్తల్లో పరస్పర అలకలు, అయిష్టాలు, సంబంధాల్లో చిన్నాచితక కలతలు తరచుగా సంభవిస్తూనే ఉంటాయి. సుదీర్ఘ దాంపత్య జీవితంలో అడుగుడుగునా ఇలాంటి పరిస్థతులు ఎదురవుతూ ఉంటాయి, ఎడముఖాలు పెడముఖాలు, మనస్పర్థలు, అలకపాన్పులు సర్వసాధారణమే. అలకలు బుజ్జగింపుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. అందుకని వేరు వేరు ఇళ్ళయితే

అలిగినప్పుడు బుజ్జగించు కోవడానికి, వ్యవహారం ముదిరి పాకాన పడకుండా చూసుకోడానికి, అవకాశాలు ఎక్కువ ఉంటాయి. ఉమ్మడికుటుంబాల్లో భార్యాభర్తలు ఇలా నిర్మొహమాటంగా చొరవ తీసుకోవడానికి, మనసిప్పి మాట్లాడు కోడానికి, నిరభ్యంతర సంభాషణకు వాతావరణం అను కూలించదు. దీనివల్ల ఒక్కోసారి చిన్న చిన్న విషయాలే పరస్పరం సంభాషించుకొనే అవకాశం లేక చిలవలు పలవలుగా మారి పెద్ద అగాధకు కారణమవుతుంది.

ఇస్లాంకోరే కుటుంబ వ్యవస్థ

ఇవి ఉమ్మడి కుటుంబ వ్యవస్థలోని కొన్ని లోపాలు మాత్రమే. వీటి నుండి రక్షింపబడడానికి ఇస్లాం తాను కోరే కుటుంబ వ్యవస్థను ప్రత్యేకంగా వేరుగా నిర్ణయించిది. ఆహారం, ఆహారంలానే నివాసం కూడా మానవుడి శాశ్వత అవసరం. మనిషి ప్రాజ్ఞతకు చేరితే, వివాహితుడైతే, విచక్షణా శీలి అయితే అతడి గృహంకూడా వేరుగా ఉండాలి. కనుక ఒకే కుటుంబం పేరుతో ఎన్నో కుటుంబాలు, గృహాలు ఒకే చోటు ఒకే నిర్వహణలో ఉండడం ఎట్టి పరిస్థితులలోనూ అభిలషణీయం కాదు. ఇంటితో పాటు ఇంటి నిర్వహణ, ఆర్థిక వ్యవహారాలు కూడా ప్రతి ఒక్కరికీ వేరుగా, స్వతంత్రంగా ఉండాలి. సామాజిక సౌలభ్యలతో కూడిన ఇస్లాం కోరే జీవన విధానం ఇది.

ప్రతి ఒక్కరికీ వేరుగా సొంత గృహం

సమాజంలో ప్రతి వ్యక్తికీ అతడి భార్యాబిడ్డల కోసం ఒక ప్రత్యేక నివాసం ఉండడం అవసరం. దీనినిర్వహణలో ఇతరుల జోక్యం లేకుండా అతడు సర్వ స్వతంత్రుడై ఉండాలి. పవిత్ర ఖురాన్ లో ఈ విషయమై ప్రత్యేకమైన ఆదేశా లున్నాయి. ఈ విషయానికి సంబంధంచిన ప్రస్తావన

వచ్చిన ప్రతిసారీ ప్రతి ఒక్కరికీ వేరుగా గృహంఉండాలని పేర్కొంటుంది. పవిత్ర ఖురాన్.

'యా అయ్యుహల్లజీన ఆమనూ లాతద్ ఖులూ బుయూతన్ గైరబుయూతికుం.' (సూర్ 27)

'విశ్వసించిన ప్రజలారా! మీ గృహాలు తప్ప ఇతరుల గృహాల్లో ప్రవేశించకండి' (సూర్.27)

ఒక మనిషికి ఒకరికంటే ఎక్కువ మంది భార్యలుంటే ప్రతి ఒక్కరికీ వేరు వేరుగా ఇళ్ళు ఉండాలి.

పవిత్రఖురాన్ ప్రవక్త సతీమణులకు వేర్వేరు గృహాలు ఉండాలని సూచించింది. పరదా విషయమైవారికి ఉపదేశిస్తూ ఇలా పేర్కొంది.

'వఖుర్న ఫీబుయూతికుం'

'మీరు మీ గృహాల్లో నే ఉండండి' (అహ్ జాబ్ 24)

మరోచోట:

వజుకుర్ న మాయుత్‌ల ఫీ బుయూతికుం మిన్ ఆయా తిల్లాహి వల్ హిక్‌మ'

'అల్లాహ్ వాక్యాల్ని, మీ మా గృహాల్లో వినిపించబడుతున్న వివేక వంతమైన విషయాల్ని గుర్తుంచుకోండి.'

(అహ్ జాబ్.34)

ప్రవక్త సతీమణులకు వేర్వేరు గృహాలుండేవని మరో సందర్భంలో కూడా ప్రస్తావించబడింది.

యా అయ్యు హల్ల జీన ఆమనూ లాతద్ ఖులూ బుయూతన్న బియ్యి ఇల్లా అయ్యూజన్ లకుం. *(అహ్ జాబ్, 53)*

'విశ్వసించిన ప్రజలారా, మీకు అనుమతి లభించనంత

వరకూ దైవ ప్రవక్త ఇళ్ళలోకి ప్రవేశించకండి."

(అహ్ జాబ్, 53)

అంతే కాదు పవిత్ర ఖురాన్ లో ఒక అధ్యాయం పేరే 'హుజరాత్' (ఇళ్ళు) అని నిర్ణయించడం జరిగింది. ఇందులో ప్రవక్త సతీమణుల వేరు వేరు ఇళ్ళ ప్రస్తావన వివరంగా ఉంది.

ప్రవక్త సంప్రదాయం

ప్రవక్త సతీమణుల ఇళ్ళన్నీ కలిసే ఉన్నప్పటికీ ఎవరిల్లు వారికి వేర్వేరుగానే ఉండేది. పవిత్రఖురాన్‌లో హుజురాత్, బుయూతున్నబీ, బుయూతన్ అన్న పదాలు ఈ విషయాన్నే సూచిస్తున్నాయి.(రహ్మతుల్లిల్ ఆలమీన్.157 మక్త బరహ్మతే దేవ్ బంద్ ప్రచురణ)

జైద్ బిన్ అబ్దుల్లా హజ్‌లీ కథనం ప్రకారం: 'హజ్రత్ ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రహ్మలై) మస్జీదెనబవిని విస్తరించే ఉద్దేశ్యంతో ఆ ఇళ్ళను పడగొట్టి నప్పుడు అవి ఇటుకలతో నిర్మించినవని నేను గమనించాను. వాటిగదులు ఖర్జూరపు మట్టలతో నిర్మించి వాటిపై మట్టిపూత వేసి ఉన్నాయి. గదులు కాక అవి మొత్తం తొమ్మిది ఇళ్ళున్నాయి. (ఇబ్నె సఅద్, అల్ తబ్ ఖాతుల్ కుబ్రా సంపుటం 449. బీరట్ 1960 ప్రచురణ)

దైవ ప్రవక్త(సల్లం) వారి అలవాట్లను గమనించినా మనకీ విషయం బోధపడుతుంది ఏ రాత్రి దైవప్రవక్త ఏ సతీమణి ఇంట గడిపే వంతు ఉంటుందో ఆ రోజు మిగతా భార్యలందరినీ అక్కడ సమావేశపరిచేవారు. ఒక్కోసారి అందరూ కలసి భోజనాలు చేసేవారు. తరువాత ఎవరిళ్ళకు వారు వెళ్ళి పోయ్యేవారు. (తఫ్ సీర్ ఇబ్నె కసీర్ సం॥ పుట466)

ఆదాయాలు కూడా వేర్వేరే

వేర్వేరు కుటుంబాలతో పాటు ప్రవక్త సతీమణుల ఆర్థికవ్యవహా

రాలు కూడా వేరు వేరు గానే ఉండేవి. దైవ ప్రవక్త (సం) ప్రతి భార్య జీవన భృతికి వేరుగా ఏర్పాట్లు చేసేవారు. ఖైబర్ విజయానంతరం ప్రతి ఒక్కరికీ సంవత్సరానికి 80 వసఖ్‌ల ఖర్జూరం, 20 వసఖ్‌ల జౌల చొప్పున నిర్ణయించారు. *(బుఖారి సంపుటం1. అధ్యాయం హర్స్‌వల్ మజార్)*

ఇదేవిధంగా వారి అవసరాలకోసం దైవ ప్రవక్త సాధారణంగా ఒక్కొక్కరికి ఒక్కో పాలిచ్చే ఒంటెను కేటాయించేవారు. ప్రవక్త సతీమణులు తమ అవసరానికి సరిపడ ఉంచుకొని మిగతాదంతా అనాథలు, వితంతువులు, పేద సాదలకు దానం చేసే వారు. ఇది వారి ధార్మిక చింతనకు నిదర్శనం. *(రహ్మాతుల్లిల్ ఆలమీన్ 2వ సంపుటం పేజి.157)*

ప్రవక్త వారి సతీమణుల్లో పరస్పరం కానుకలు ఇచ్చి పుచ్చుకొనే సంప్రదాయం కూడా ఉండేది. ఎవరి ఆర్థిక వ్యవహారాలు వారికి వేర్వేరుగా ఉన్నప్పుడు మాత్రమే ఇది సాధ్య మయ్యేది.

హజ్రత్ అలీ (రజి) హజ్రత్ ఫాతిమా (ర.అన్‌హు) లకు వేరుగా ఇల్లు

వివాహానంతరం హజ్రత్ అలీ (రజి) హజ్రత్ పాతిమా (ర అన్‌హు)ల ఇంటిని దైవప్రవక్త (సల్లం) తన కే మాత్రం సంబంధం లేకుండా వేరు చేశారు. ఫాతిమ తుజ్జహరా (ర.అన్‌హు) తో ప్రవక్త మహనీయునికి ఎంతటి ప్రేమానురాగాలున్నాయో అందరికీ తెలిసిన విషయమే. అయినప్పటికీ వివాహానంతరం ఆమె ఇంటిని వేరు చేశారు. అంతేకాదు, ఒక సందర్భంలో ఫాతిమా నా గారాలపట్టి అని అన్నారు ప్రవక్త (సం). ఏ విషయం ఫాతిమాను బాధ పెడుతుందో అది నన్నూ బాధిస్తుంది. ఏ విషయం ఆమెకు ఆ వేదన కలిగిస్తుందో, అది నన్ను ఆవేదనకు, ఆందోళనకు గురి చేస్తుంది అన్నారు.(ముత్త ఫఖున్ అలై, మిష్కాత్ ఆధారంగా)

మరో సందర్భంలో ఆయన(సల్లం) 'ప్రపంచ వాసులందరిలో కల్లా ఫాతిమానే నాకు అత్యంత ప్రాణప్రదం' అని సెలవిచ్చారు. (తిర్మిజి,)

అంతే కాకుండా హజ్రత్ అలీ (రజి) దైవ ప్రవక్తకు సొంత బాబాయి కొడుకు. బాబాయి అబూతాలిబ్ ఉపకారాలు దైవ ప్రవక్త పై ఎన్నో ఉన్నాయి. ఆయన దైవ ప్రవక్తను బాల్యనుండి కన్న కొడుకులా సాకారు. ఇంటా బయటా ఆయన్ను గుండెలకు హత్తు కొని తిరిగారు. దైవప్రవక్తగా నియమితులైన తర్వాత కూడా ఆయన ఇస్లాం స్వీకరించినప్పటికీ దైవ ప్రవక్తతో ఆయన సంబంధాలు యధాతధంగా కొనసాగాయి. ఈ సంబంధం కారణంగా ఆయన సదా దైవప్రవక్తకు వెన్నంటి నిలిచారు.

బాబాయి అసాధారణ ఉపకారాలతోపాటు, సోదరుని వ్యక్తిత్వం పరిమళం కూడా తక్కువేమికాదు. ఇస్లాంకు పూర్వం కూడా హజ్రత్ అలీ దైవ ప్రవక్త చల్లని ఒడిలో శిక్షణ పొందిన వ్యక్తీ. ఆయన (సం) కు తన ప్రియసోదరుని పట్ల అమితమైన వాత్సల్యం సంబంధం ఉండేది. మహిళల్లో అందరికంటే ప్రియమైన వారు హజ్రత్ ఫాతిమా అయితే పురుషుల్లో అందరికంటే ఎక్కువ ప్రేమ ఆయన పట్లనే ఉండేది. (డిటో)

కాని వీరిరువురి పట్ల ఇంతటి అనుపమాన ప్రేమాను రాగాలున్న ప్పటికీ వివాహానంతరం వారి ఇంటిని తన ఇంటితో సంబంధం లేకుండా వేరు చేశారు ఆయనకు మగసంతానం లేని కారణంగా, ప్రవక్త(సం) హజ్రత్ అలీని ప్రేమతో సాకారు. ఈ విధంగా బాబాయి కొడుకైన సోదరుని పై ఆయన కు అసాధారణమైన ప్రేమనురాగాలుండేవి. ఈ విధంగా చూస్తే హజ్రత్ ఫాతిమాతో ఆయన వివాహ సంబంధం చాలా దగ్గరి సంబంధం అన్నమాట. ఇలాంటి వారిని వేరే ఇంట్లో ఉంచడం ఉమ్మడి కుటుంబ వ్యవస్థ నేపథ్యంలో ఎంతో అసాధారణ సంఘటనలు సంభవిస్తే తప్ప సాధ్యంకాదు. కాని స్పష్టమైన ఇస్లామీయ ఆదేశాలను అనుసరిస్తూ వివాహా నంతరం హజ్రత్ ఫాతిమా (ర.అన్హా) హజ్రత్ అలీ (రజి)ల గృహాన్ని వేరుగా కేటాయించారు దైవప్రవక్త (సల్లం).

ఇస్లాం దృష్టిలో ఒక వేళ ఉమ్మడి కుటుంబాలకు ఏ మాత్రం ఆదరణ. అవకాశాలు ఉన్నట్లయితే హజ్రత్ ఫాతిమా, హజ్రత్ అలీ లకంటే ఈ అవకాశాన్ని వినియోగించుకునే హక్కు మరెవరికుంటుంది.? కాని దేవుని ప్రియ ప్రవక్త (సల్లం) తన ముద్దుల బిడ్డ, గారాల పట్టి విషయంలోనే ఈ అవకాశానికి ఆస్కారం లేదని ద్వారాలు మూసినప్పుడు, ఇక దూరపు బంధువుల విషయంలో ఈ ద్వారాలు ఎలా తెరచుకుంటాయి?

భార్య నివాస హక్కు

ఇస్లాం కోరే సామాజిక వ్యవస్థ ఎలా ఉండాలి? కుంటుంబ వ్యవస్థ ఏయే వ్యక్తులతో కలసిఏర్పడాలి? ఒక కుటుంబసభ్యుడు వేరుపడి ఎలా తన నివాసాన్ని ఏర్పరచుకోవాలి? ఇస్లాం భార్యకు సొంత ఇంటి హక్కును కల్పించి ఈ సమస్యను సృష్టంగా పరిష్కరించింది. వివాహానంతరం భార్య పట్ల భర్తపై తారసిల్లే బాధ్యతల్లో తమ ఇరువురి సంబంధీకులతో సంబంధం లేకుండా తమకంటూ ఒక ఇంటిని సమకూర్చాలి. ఈ విషయం హనఫీ పంథాను ప్రతిబింబించే ప్రఖ్యాత గ్రంథం 'కన్ జుద్దిఖాయఖ్' లో ఉంది: 'భర్త పై భార్య హక్కు ఇది. భర్త భార్య కోసం ఒక ఇంటిని సమకూర్చాలి. ఇది భార్య హక్కు. ఇందులో భార్యాభర్తల సంబంధీకులు ఏవరూ నివాస ముండరాదు."

వివాహానంతరం వేరుగా సొంత ఇల్లు భార్య మౌలిక హక్కు. అందులో ఆమె అభీష్టానికి విరుద్ధంగా భర్త ఎవరికీ భాగస్వామ్యం కల్పించ లేడు. ఉమ్మడి ఇల్లు ఏవిధంగా చూసినా ఆమెకు ఆమోదయోగ్యంకాదు, ఉమ్మడి ఇంట్లో ఆమెకు రకరకాల అవరోధాలు ఏర్పడతాయి. దీన్నుండి ఆమెను కాపాడడం అవసరం. అయితే అనివార్యకారణాలు, కుటుంబ పరిస్థితులు కారణంగా ఆమె స్వయంగా ఆమె హక్కును కాస్తంత వదులు

కోడానికి సంతోషంగా సిద్ధపడితే అది వేరే విషయం. మరో చోట ఇలా ఉంది.

'నివాసం భార్య మౌలిక హక్కు, వాజిబ్, కనుక మరొకర్ని అందులో భాగస్వామిని చేయడానికి భర్తకు అధికారం ఉండదు. ఎందు కంటే దీనివల్ల ఆమెకు అసౌకర్యం కలుగుతుంది. బాధకలుగుతుంది. కష్టాలు కలుగుతాయి. వస్తు సామగ్రి విషయంలో ఆమెకు నిశ్చింత ఉండదు,భర్తతో సరదాగా, నిక్షేపంగా కబుర్లు చెప్పుకోడానికి, ప్రేమపూర్వక సంబంధాలు నిరభ్యంతరంగా నెరపడానికి అవరోధాలు ఏర్పడతాయి. అయితే ఆమె స్వయంగా అన్నింటికీ ఇష్టపడి, తన ఈ ఏకాంతపు హక్కును వదులు కోడానికి అంగీకరిస్తే అది వేరే విషయం.'

(హిదాదు 2వ సంపుటం, 421వపేజి)

అంతే కాదు భర్త చట్టం దృష్ట్యా తన మరో భార్య కొడుకును ఆమెతో పాటు ఒకే ఇంట్లో ఉంచలేడు. ప్రాజ్ఞత రాని లైంగిక సంబంధాల జ్ఞానంలేని తన పిల్లవాణ్ని మాత్రమే ఉంచవచ్చు. (రద్దుల్ ముహతార్, 2వ సంపుటం)

భార్యకు సమకూర్చ బడే నివాసం ఎలా ఉండాలి? ఏవిధంగానైతే తిండీ, బట్టకు సంబంధించి పేద ధనిక వ్యత్యాసాలుంటాయో ఈ విషయంలో కూడా అదే సూత్రం వర్తిస్తుంది. అయితే భార్య భర్తల్లో ఒకరు ధనికులు, ఒకరు పేదవారైతే, అన్న వస్త్రాలకు లాగానే మధ్యస్త మార్గాన్ని అనుసరించాలి. భర్త తన పరిధులు, పరిస్థితుల కనుగుణంగా ఆమెకు ఇంటి వసతిని సమకూర్చాలి. *(రద్దుల్ ముహతార్)*

'ఫిఖా' లోని ఒక ప్రకరణ ప్రకారం ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు అనుకూలంగా ఇలా చెప్పుకోవచ్చు. అదేమిటంటే, భర్త ఒక పెద్ద ఇంటిలోని ఒక భాగాన్ని, దాని తాళం, తాళంచెవితో సహ భార్యకు అప్పగిస్తే ఆమె నివాస హక్కు నెరవేరుతుంది.'హిదాయ'లో ఇలా ఉంది.

"ఒక వేళ భర్త విశాలమైన ఇంట్లోని ఒక భాగాన్ని దాని వేరు తాళం, తాళం చెవితో సహ ఇచ్చేస్తే ఆమెకు సరిపోతుంది. ఎందుకంటే దీనిద్వారా నివాస ఉద్దేశ్యం నెరవేరుతుంది కాబట్టి.'

(హిదాయ. 2వ సంపుటం 421వ పేజి)

దీని దృష్ట్యా ప్రఖ్యాత సమస్యల పరిష్కార గ్రంథం 'బెహిష్తి జేవర్' లో- 'నివసించడానికి ఇల్లు సమకూర్చే విషయం ఇలా ఉంది

'భర్త భార్య కోసం ఎలాంటి ఆవాసాన్ని ఏర్పాటు చేయాలంటే అందులో భర్త తరపు బంధువులెవరూ లేకుండా ఖాళీగాఉండాలి. ఎందుకంటే, భార్యా భర్తలు ఎలాంటి జంకూ మోహమాటం లేకుండా అందులో అవరోధంలేకుండా, ఉండగలగాలి. అయితే భార్యస్వయంగా అందరితో కలిసుండడానికి అంగీకరిస్తే ఉమ్మడిగా ఉంచడంలో కూడా తప్పు లేదు'. *(బెహిష్తి జేవర్4వ సంపుటం 237వ పేజి)*

రెండో ప్రశ్నకు సమాధానంగా ఇలా చెప్పబడింది: 'స్త్రీ తాను స్వయంగా ఉంటూ, తన వస్తు సామగ్రినంతా సంరక్షించుకునే విధంగా, మరెవరూ అందులోకి ప్రవేశించే అవకాశం లేని విధంగా, తాళం తాళం చెవి ఆమెకు అప్పగించి, ఇంట్లోని ఒక భాగాన్ని పూర్తిగా ఆమెకే కేటాయించినట్లయితే, మొత్తం ఇల్లు నాకే కావాలని అడిగే అధికారం ఇక ఆ స్త్రీకి ఉండదు'.

కాని సాధారణంగా చెప్పబడిన ఈ విషయంద్వారా సమస్య సంపూర్ణంగా పరిష్కారం కాదు. దాని స్వరూపం స్పష్టంగా మనముందుకు రాదు. దీనికి మరింత వివరణ అవసరం. (దుర్రెముఖ్తార్) విశాలమైన ఇంటిలోని ఒక భాగం లేక ఒక గది తాళపుచెవి ఆమెకు లభించినప్పటికీ ఇతర అవసరాలు, సౌకర్యాలను కూడా ఇలా ఆయన ప్రస్తావించారు.

'పెద్ద ఇంటిలోని ఒక భాగం తాళపుచెవితో పాటు ఇతర సౌకర్యాలు

ఉన్నప్పటికీ, మరుగుదొడ్డి, వంటశాల ఆ ఇంటికి అనుబంధంగా ఉండడం తప్పనిసరి' *(రద్దుల్ ముహతార్, 2వ సంపుటం)*

దీనివల్ల మనకు స్పష్టంగా తెలిసే విషయం ఏమిటంటే, మనిషి స్థోమత కలవాడైతే, ఆర్థిక పరిస్థితులు అనుమతిస్తే సకల సౌకర్యాలతో భార్య కోసం వేరుగా ఇంటిని సమకూర్చవలసి ఉంటుంది. అలాకాకుండా అతడు లక్షలకు అధిపతి అయినప్పటికీ, అన్ని సౌకర్యాలతో ఇంటిని సమకూర్చుకొనే ఆర్థిక స్థోమత ఉన్నప్పటికీ, కేవలం సామాజిక ఒత్తిళ్ళ, వాతావరణ ప్రభావానికి ప్రభావితుడై ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పైని గుడ్డి నమ్మకంతో తన భార్య కోసం సొంత ఇంటిని నిర్మించకుండా ఉమ్మడి కుటుంబంలో ఉంచి ఆమెకు కష్టాలకు గురి చేయడం అజ్ఞానం తప్ప మరేమి కాదు.

పవిత్ర ఖురాన్‌లో భర్త తన శక్తి, ఆర్థిక స్థోమత మేరకు భార్యకు ఇంటి ని సమకూర్చడంతో పాటు మరి రెండుషరతులను సైతం జోడించింది. అంటే ఆమెను ఒత్తిడికి, అసౌకర్యానికి కష్టాలకు వేధింపులకు గురి చేయరాదు.

అస్కినూహున్న మిన్ హయ్‌సు సకన్ తుమ్ మింవ్యజ్‌దికుం వలాతుకుం వలాతుజా్రరూ హున్న లితుజయ్యిఖూ అలహున్న.'

"మీరు నివసించే చోటనే (మీ భార్యలను) వారినీ ఉంచండి. ఆచోటు ఎలాంటిదైనా పరవాలేదు. (పొమ్మన లేక పొగ పెట్టి నట్లు) వారిపై ఒత్తిడితెచ్చి, అసౌకర్యానికి గురి చేసి వారిని వేధించకండి" (తలాఖ్.6)

ఎలాగూ పెద్ద ఇంటిలోని ఒక భాగాన్ని సమకూర్చామన్న ఉద్దేశ్యంతో పైన పేరొన్న హితవును విస్మరించరాదు. అదేవిదంగా బలహీన

వర్గాల విషయంలో కొన్ని గృహ సౌకర్యాలను వారికి దూరం చేయరాదు. అంటే ఉమ్మడి కుటుంబంలోని కులీన వర్గం వారు అనుభవిస్తున్న సౌకర్యాలను వీరు బలహీన వర్గాల నుండి వచ్చారనే ఉద్దేశ్యంతో విభజించ కూడదు. ఈ కారణంగానే పెద్ద ఇంటిలోని ఒక భాగం లేక గదిని సమ కూర్చడమే సరిపోదని అదనంగా ఈ విషయ విధించడం జరిగింది. అది కూడా ఆ ఇంట్లో భార్యకు ఇబ్బంది కలిగించే ప్రమాదమున్న భర్త బంధువు లెవరూ ఉండ కూడదు.

కనుక ఒక వేళ ఎవరైనా, ఒక పెద్ద ఇల్లు ఉంది, అందులో విడి విడిగా భాగాలు చేసినట్లయితే, ఆ ఇళ్ళకు విడివిడిగా తాళాలు వేసు కునే సదుపాయం ఉన్నట్లయితే ఇక ఆమెకు ఈ ఇల్లు కాకుండా మరో ఇల్లు కావాలని అడిగే అధికారం ఉండదు. అయితే అక్కడ తనకు ఇబ్బంది కలిగించే ప్రమాదమున్న భర్తబంధువు లెవరూ ఉండకూడదన్నది షరతు' (రద్దుల్ ముహతార్;) ఒక వేళ భార్య తన సవతి, ఇతర భర్త బంధువుతో కలసి నివసించడానికి ఇష్టపడని పక్షంలో కూడా అన్ని సౌకర్యాలతో ప్రత్యేకంగా ఇంటిని సమకూర్చడం భర్తకు తప్పనిసరి అవుతుంది. పరిమిత మైన చిన్న ఇంట్లో ఒక భర్త తన భార్యనూ, తల్లినీ కలిపికూడా ఉంచలేడు.' భార్య నూ, తల్లినీ ఒకే ఇంట్లో ఉంచే అధికారం అతనికి లేదు. ఎందుకంటే ఇది మక్రూ(అవాంఛనీయం)అవుతుంది. భర్త భార్యతో ప్రత్యేక సంబం ధాలు నెరపడానికి ఇంట్లో ఇతరులున్నప్పుడు వీలు పడదు. అయితే ఒకే ఇంట్లో , రెండు వేర్వేరు పోర్షన్లు లేక వేర్వేరుగదులు ఉన్నప్పుడు ఎలాంటి అభ్యంతరము లేదు. ఒక పెద్ద ఇంట్లో భార్యను ఒక పోర్షన్ లో, తల్లిని మరో పోర్షన్ లో ఉంచితే సరిపోతుంది.

వాస్తవం ఏమిటంటే, ఈ వివరణ అంతా సగటు మధ్యతరగతి మహిళకు మాత్రమే వర్తిస్తుంది. ఉన్నత కుటుంబాల్లోని స్త్రీలు విశాలమైన ప్రత్యేక గృహాన్ని తన కోసం కోరవచ్చు. ఈ విషయాన్ని కొంత మంది ఇతర

ధర్మవేత్తలు ఇలా చెప్పారు. అల్లామాషామా ప్రకారం, మొదటి ప్రస్తావిత విషయాన్ని సగటు మధ్య తరగతి కుటుంబాల్లోని మహిళకు ప్రత్యేకించ వచ్చు, టూకీగా చెప్పాలంటే ఈ విషయం విభిన్న వర్గాలవారికి విభిన్నంగా ఉంటుంది. కాబట్టి కులీన కుటుంబాల్లోని ఉన్నత స్థాయి స్త్రీలకు విశాలమైన ప్రత్యేక గృహం సమకూర్చడం తప్పనిసరి. అయితే సగటు మధ్య తరగతి స్త్రీలకు పెద్ద ఇంటి లోని ఒకభాగం సరిపోతుంది. సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పేద, మధ్య తరగతి వర్గాలు దేశదిమ్మరులు గుడిసెల్లో, సాధారణగృహాల్లో నివాసం ఉంటూ ఉంటారు. వీరి మధ్య ఎలాంటి బేధాభిప్రాయలు లేక ఏకాభిప్రాయం కలిగి ఉంటారు. ఇంతకు ముందు ప్రస్తావించుకున్న విషయం, అంటే, ఇంటికి సంబందించిన విషయం భార్యాభర్తల పరస్పర అవగాహన, వారి స్థితిగతులను అనుసరించే ఉండాలి.

దైవం తన గ్రంధంలో సెలవిచ్చినట్లు, 'మీరు నివాస ముండే గృహాల్లోనే వారిని ఉంచండి. ఈ నాటి పరిస్థితుల్లో ఇదే ఆచణీయ మార్గం. ఎందుకంటే కాలానికనుగుణంగా, పరిస్థితుల కనుగుణంగా దుస్తులు, ఆహార విషయాలు మారుతూ ఉంటాయి.' (బెహిష్తీ జేవర్: 913, 914)

ఈ వివరణ ద్వారా ఇస్లాం కోరే కుటుంబవ్యవస్థ స్వరూప స్వభావాలు ఏమిటో చాలా స్పష్టంగా మనముందు కొస్తాయి. అదేమిటంటే, వివాహానంతరం తన కంటూ ప్రత్యేక నివాసం భార్యకున్నటువంటి మౌలిక హక్కు. ఒక కుటుంబం భార్య, భర్త, ప్రాజ్ఞత రాని సంతానంతో కలసి ఏర్పడాలి. ఇక పోతే భార్యకు లభించే ప్రత్యేక నివాసం ఎలాంటిదై ఉండాలి? ఇది భార్యాభర్తల, వారి కుటుంబాల పరిస్థితి, స్థితిగతులు పై ఆధారపడి ఉంటుంది.

అతడి ఆర్ధిక పరిస్థితులు అనుమతిస్తే, ఎలాంటి అవరోధాలూ

లేకపోతే, తిండీ బట్టకు లాగానే తన శక్తిమేర ఆమెకోసం ఓ చక్కని ఇంటిని కూడా సమకూర్చాలి. ఏ విధంగానూ ఈ ఇంటికి మరో ఇంటితో సంబంధం ఉండ కూడదు. ఈ విధంగా చేయడానికి పరిస్థితులు అనుకూలించకపోతే, ఒక పెద్ద ఇంటిలోని ఒక భాగంతోనే సంతృప్తి పడవచ్చు. అయితే భార్యకు భర్త బంధువులనుండి ఎలాంటి ఇబ్బంది బాధ కలగకూడదన్నది షరతు. పరిస్థితుల ప్రభావంవల్ల అనివార్య కారణాల వల్ల భార్య భర్త, బంధువులతో ఉమ్మడి కుటుంబంలో ఉండడానికి అంగీకరిస్తే దానికి కూడా అవకాశం ఉంది. అసలు విషయం ఏమిటంటే, అల్లాహ్ సెలవిచ్చినట్లుగా ఇల్లు మనిషి స్థోమత మేరకు ఉండాలి. అందులో భార్యకు ఏ విధమైన ఇబ్బంది కాని, ఒత్తిడి గాని, వేధింపులు కాని ఉండకూడదు, ఆమె అందులో సుఖంగా ప్రశాంతంగా ఉండగలగాలి,

అన్నిటికంటే ఉత్తమమైన, సురక్షిత మైన విధానం ఏమంటే, అవసరమైన సకల సౌకర్యాలతో కూడిన ప్రత్యేక గృహవసతి భార్యకు కల్పించాలి, అలాంటి గృహం ఏ స్థాయిలో ఉన్నా పరవాలేదు. కాని ఆగృహం పూర్తి వేరుగా స్వయంపోషకమై ఉండాలి. దైవ ప్రవక్త సంప్రదాయం కూడా ఈ విషయాన్నే దృవపరుస్తోంది. ఈ కోణంతో ప్రతి భార్యకు స్వయం పోషకమైన ఇల్లు ఉండాలన్న విషయం ద్యోతకమవుతుంది.

పురుషులు పరాయి స్త్రీలతో కలవడం

దైవప్రవక్త ముహమ్మద్(సల్లం) పురుషులను పరాయి స్త్రీల వద్దకు వెళ్ళ వద్దని ఆదేశిస్తూ, 'ప్రజలారా', పరస్త్రీల వద్దకు వెళ్ళకుండా జాగ్రత్త పడండి అని ఆదేశించారు. దీనికి అన్సార్ తెగ వ్యక్తి ఒకాయన 'భర్త సోదరుడు, తండ్రి. ఇతర బంధువులకు కూడా ఈ ఆదేశమే వర్తిస్తుందా?' అని ప్రశ్నించాడు. భారతదేశంలో లాగానే పాకిస్తాన్ కూడా ఆనాటి అరబ్ దేశంలో కూడా ఈ విషయాన్ని తప్పుగా భావించేవారు కాదని దీనివల్ల

మనకు అనిపిస్తుంది. అప్పుడు దీనికి ఇక సమాధానంగా దైవప్రవక్త(సల్లం) 'భర్త బంధువులు (ముఖ్యంగా పురుషులు) మృత్యువు నుండి తప్పించుకున్న విధంగా తప్పించుకోవలసినవాళ్ళు అని సెలవిచ్చారు. 'హమూ' అంటే భర్త సోదరులు, అలాంటి ఇతర బంధువులు. ఉదాహరణకు బాబాయి కొడుకు వగైరా ....ఈ బంధువుల్లో భర్త సోదరులు, వారి కొడుకులు, బాబాయి కొడుకులతో పాటు, భర్త తండ్రి, బాబాయి కూడా చేరి ఉన్నారు. అయితే ఇక్కడ ముఖ్యంగా భర్త తండ్రి, అతడి సవతి సంతానమే కాకుండా, భార్యకు వివాహానికి ధర్మసమ్మతమైన పురుష బంధువులు. వీరిని గైర్ ముహర్రిం అంటారు. ఉదా॥ భర్త సోదరులు, సోదరుని కొడుకులు, అతని బాబాయి, బాబాయి కొడుకులు. వగైరా సాధారణంగా ఈ బంధువుల పట్ల ప్రజలు అంతగా పట్టించుకోరు. సోదరుని భార్యతో వీరి ఏకాంతాన్ని తప్పుగా భావించరు. వాస్తవానికి అపరిచిత పురుషుల కంటే ఎక్కువగా వీరిపట్లనే అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. హదీసులో ఈ భర్త బంధువులనే మృత్యువు కంటే ఎక్కువ ప్రమాదమని అభివర్ణించడం జరిగింది.

(షరహ్నూవీ లిల్.ముస్లిం సం॥ 2 పేజి 214.)

దీనికి కారణం ఏమంటే ఇమాం నూలీయే అన్నట్లు 'ఈ రకమైన భర్త బంధువుల నుండే ఇతర అపరిచితుల కంటే ఎక్కువ ప్రమాదం పొంచి ఉంటుంది. చెడు ప్రబలడానికి వీరివల్లనే ఎక్కువ అవకాశం ఉంటుంది. ఎందుకంటే వీరు స్త్రీల వద్దకు చేరడానికి, వారితో ఏకాంతంగా గడపటానికి ఎక్కువగా అవకాశాలు కలిగి ఉంటారు. ఈ అవకాశాలు ఇతరులకు అంతగా ఉండవు. ప్రజలు కూడా దీన్ని తప్పుగా భావించరు. (షరహ్నూవీలిల్. ముస్లిం సం॥ 2 పేజి 214.)

ఇతర హదీసుల్లో కూడా దైవ ప్రవక్త(సల్లం) స్త్రీ, పురుషుల ఏకాంతాన్ని కఠినంగా వారించారు.' ఒక స్త్రీ ఒకపురుషుడు ఏకాంతంగా

ఉన్నట్లయితే మూడో వాడు షైతాన్ అని సెలవిచ్చారు. (తిర్మిజి మిష్కాత్ ఆధారంగా 2వ సంపుటం)

భర్త ఇంటి వద్ద లేనప్పుడు ఆ స్త్రీల వద్దకు వెళ్ళడాన్ని కూడా ఆయన కఠినంగ వారించారు. కారణం ఏమిటంటే షైతాన్ మానవుడి నరాల్లో రక్తంలా ప్రవహిస్తుంటాడు. (మిష్కాత్, తిర్మిజి)

దైవప్రవక్త (సల్లం) వారి ఈ హదీసుల సారాంశం ఏమిటంటే , ఇస్లామీయ సమాజంలో ప్రతి కుటుంబానికి వేరుగా, ప్రత్యేకంగా స్వయంపోషకం కలిగిన ఒక సొంత ఇల్లు ఉండాలి. అది ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరుల జోక్యానికి అతీతంగా ఉండాలి. పెద్ద ఇల్లు, లేక కోట లాంటి ఇంటి ఒక భాగం దానిలో సకల సౌకర్యాలు ఉన్నప్పటికీ దైవప్రవక్త వారి ఈ హితవులు ప్రకారం ఆచరించడం దుర్లభమైపోతుంది.

పరదా ఆదేశాల ధృవీకరణ

ఇస్లాం ఏమహోన్నత సమాజాన్ని నిర్మించదలచిందో దానిలో స్త్రీల పరదా ఒక ప్రధానమైన భాగం. పరదా ఆదేశాలు ఖురాన్‌లో చాలా వివరంగా ప్రస్తావించబడ్డాయి. దీనివల్ల మనకు చాలా విషయాలు తెలుస్తున్నాయి. అందులో సమాజంలో ప్రతి కుటుంబానికి ప్రత్యేకంగా గృహవసతి కల్పించబడాలన్న విషయమూ స్పష్టంగా ఉంది.

సలాము చేసి ఇంట్లో ప్రవేశించడం

నూర్ సూరాలో పరదా ఆదేశాలను విపులీకరిస్తూ పవిత్ర ఖురాన్ మొట్ట మొదట చెప్పిన విషయం ఏమిటంటే, 'మనిషి' ఇతరుల ఇళ్ళలోకి వారికి సలాం చేయకుండా, వారి అనుమతి లేకుండా ప్రవేశించవద్దు' అన్నది (నూర్27) పూర్తి అనుమతి లభిస్తేనే ప్రవేశించాలి. ఒక వేళ ఇంట్లో

ఎవరూ లేక పోయినా, అనుమతి లభించక పోయినా వెనుదిరిగి వెళ్ళిపోవాలి. (నూర్28)

గృహం వేరుగా ఉన్నప్పుడు మాత్రమే ఇటువంటి అవకాశం ఉంటుంది. విశాల మైన, ఉమ్మడి కుటుంబమలో ఈ ప్రశ్న తలెత్తదు.

పరదా చాటునుండి అడగడం

మరో సందర్భంలో పవిత్ర ఖురాన్ ఇలా ఉపదేశించింది. ఒక మనిషికి ఇతరుల ఇంటినుండి ఏదైనా వస్తువు అవసరమైతే, నేరుగా అతని ఇంట్లో కి ప్రవేశించకుండా, పరదా చాటున ఉండి ఆ ఇంటి స్త్రీ లతో ఆవస్తువును అభ్యర్థించాలి, **'మీరు వారిని ఏదైనా అడగదలచుకుంటే తెర వెనుక నిలబడి అడగండి. ఇది చిత్తశుద్ధి కోసం మీకూ, వారికీ ఎంతో మంచి పద్ధతి.'** (అహ్‌జాబ్ 53)

ఇల్లు వేరుగా ఉన్నప్పుడు మాత్రమే పరదా వెనుక ఉండి అడిగిన దానికి ప్రయోజనం చేకూరుతుంది. ఉమ్మడి నివాసంలో ఏ స్త్రీ గది పరదా చాటు నుండి అడిగినా పరదా ఆదేశంలోని ఔచిత్యం నెరవేరదు, దానికసలు అర్థమే ఉండదు. ప్రవక్త సతీమణుల కోసం అవతరించిన ఈ ఆ దేశాలు యావత్తు ముస్లిం సమాజం కోసం అని తెలుసుకోవాలి. స్త్రీ ప్రయోజనాలు వారికి ప్రత్యేక గృహవసతి రూపంలోనే ఒనగూడుతాయి.

ముహర్రిం, గైర్ ముహర్రిం బంధువులతో పరదా

ఇస్లాం మానవ నైజానికి తగినట్లుగానే ఇస్లాం ఇచ్చేపరదా ఆదేశాల్లో విశిష్టత ఉంది. పూర్తి అనుగుణమైన విశిష్టమైన ఆదేశాలను పరదా ప్రసాదించింది. శాశ్వతంగా ప్రేమ, వివాహానికి నిషిద్ధమైన అత్యంత సమీప బంధువుల విషయంలో, వారు నిరభ్యంతరంగా ఇంట్లోకి రాకపోకలు సాగించవచ్చని పవిత్ర ఖురాన్ అనుమతినిచ్చింది. తండ్రి, కొడుకు,

సోదరుల, సోదరుని కొడుకులు, మేనల్లుడు ఇంకా ఇలాంటి ఇతర సమీప బంధువుల ముందు పరదాలేదు." *(మరిన్ని వివరాలకు నూర్‌సూరా 31వ, అహ్‌జాబ్ సూరా 55 వాక్యాలు చూడండి.)*

ఈ సమీప బంధువులు, ఇలాంటి ఇతర కొందరు బంధువులు తప్ప తన ఇతర బంధుమిత్రుల ముందు తన అందచందాలను నిరభ్యంతరంగా బహిర్గతం చేయడానికి స్త్రీకి అనుమతి లేదు.

భర్త సోదరులు, భర్త బాబాయి కొడుకులు, అతని బాబాయి, అతని కొడుకులు మొదలగు వారితో కూడా ఇతర అపరిచిత వ్యక్తుల మాదిరిగానే స్త్రీ పరదా పాటించాలి. ఇది ఇల్లు వేరుగా ఉన్నప్పుడు మాత్రమే సాధ్యమవుతుంది. అలాకాక, తాతల కొడుకులు, మనవళ్ళు మొదలగు వారితో విస్తరించిన ఉమ్మడి కుటుంబంలో స్త్రీ అందచందాలు అపరిచితుల ముందు బహిర్గతం కాకుండా ఉండజాలవు. మొత్తం కుటుంబీకుల ఉమ్మడి ఆస్తి అయిన ఏకైక నివాసంలో ఏ వ్యక్తీ ఇతరులపై ఓత్తిడి తేవడంకాని, నిషేధం విధించడం గాని చేయలేడు.

ఈ సందర్భంలో ఒక సందేహాన్ని నివృత్తి చేయడం అవసరమని భావిస్తున్నాము. ఆదర్శ ఉమ్మడి కుటుంబాల ఆచారం ఏమిటంటే, ఈ కుటుంబాల్లోని పురుషులకు ఇంట్లో సంబంధాలు చాలాచాలా తక్కువ ఉంటాయి. ఇలాంటప్పుడు ఇంటికి ఎవరైనా వరుసైన పురుషులు అకస్మాత్తుగా రావడం తటస్థిస్తే వారినుండి తప్పించుకు తిరగడమెలా అన్నది సందేహం. కాని ఇస్లాం అభిలషించే కుటుంబ వ్యవస్థలో ఇది పురుషుడు మొత్తం రాత్రి పగలు కూడా కొంత భాగాన్ని తన భార్యాతో గడపాలి. పరదా ఆదేశాల్లో భాగంగా పవిత్ర ఖురాన్ మరో ముఖ్య మైన హితవు కూడా చేసింది. 'ఇంట్లో నిరభ్యంతరంగా తిరిగే మీ బానిసలు, ప్రాజ్ఞత వయసుకురాని మీ బాల బాలికలు మీ దగ్గరికి రావాలంటే వారు

మూడు వేళల్లో మీ అను మతి తీసుకోవలసి ఉంటుంది. ప్రాత;కాల ప్రార్ధనకు ముందు, మధ్యాహ్నం వేళ, మీరు విశ్రాంతి కోసం మీ పై ఉడుపులు తీసి వేసినప్పుడు, రాత్రి వేళ ఇషా నమాజ్ తరువాత ' (నూర్.58)

అంటే పూర్తి రేయితో పాటు పగలు కూడా ఎంతో కొంత భాగం పురుషుడు తప్పనిసరిగా ఇంట్లో గడపాలి. పురుషుడు ఇంట్లో గడిపే బదులు ఎక్కువ సమయం బయటే గడుపుతూ ఎప్పుడో అపుడు భార్యాతో సంబంధాలు కొనసాగిస్తున్నట్లుయితే, ఇలాంటి కుటుంబాల తీరును ఖురాన్ తీవ్రంగా నిరసించింది.

మరొక దృష్టాంతం

ఇస్లాంకోరే కుటుంబ వ్యవస్థ ప్రేమ, స్నేహ సౌహార్ధతలను ప్రతిబింబించే వ్యవస్థ. ఇందులో ప్రేమానురాగాల వ్యక్తీకరణలే కాకుండా ప్రత్యేకంగా కుటుంబంలోని సమీప బంధుమిత్రుల్లో నిరభ్యంతరంగా నిరంతరాయంగా విందు భోజనాల పరంపర సాగుతూ ఉండాలి. ఈ విషయంలో పవిత్ర ఖురాన్ కుటుంబంలోని సమీప బంధువులతో పాటు సమాజంలోని ఇతర పేదసాదలు, ఆగత్యపరులను ప్రత్యేకంగా దృష్టిలో పెట్టుకోవాలని చెప్పింది. వీరు కుటుంబ సభ్యులకు లాగానే ఎలాంటి మొహమాటంలేకుండా ఇతరులు ఇళ్ళలో విందు ఆరగించగలరు. అవసరమెచ్చినప్పుడు వారి ఇంటి ద్వారం తట్టగలరు. వీరిలో కుటుంబం లోని వారే కాకుండా ఇతర ఇళ్ళవారు కూడా ఉంటారు. వారికి కూడా ఈ ఆదేశమే వర్తిస్తుంది. ఈ విషయాన్నే వివరిస్తూ పవిత్ర ఖురాన్ ఇలా అంటోంది.

"అంధుడుగాని' వికలాంగుడుకాని, లేదా వ్యాధిగ్రస్తుడు గాని
ఎవరింట్లోనైనా ఏదైనా ఆహారం తింటే తప్పులేదు,
స్వయంగా మీరైనా సరే మీ ఇండ్లలోగాని, మీతండ్రి తాతల

ఇళ్ళలో గాని, మీ తల్లి అమ్మమ్మ, నాయనమ్మల ఇళ్ళలోగాని, మీ అన్నదమ్ముల ఇళ్ళలోగాని, మీ బాబాయి, పెదనాన్నల ఇళ్ళలోగాని, మీ మేనత్తల ఇళ్ళలోగాని, మీ మేనమామల ఇళ్ళల్లోగాని, మీ పిన్ని, పెదనాన్నల ఇండ్లలోగాని, తాళం చెవులు మీ ఆధీనంలో ఉన్న ఇండ్లలోగాని లేదా మీ స్నేహి తుల ఇళ్ళలోగాని ఏదైనా ఆహారం తింటే తప్పులేదు. అలాగే అందరూ కలసి తిన్నా, వేర్వేరుగా తిన్నా తప్పు లేదు." (నూర్ - 61,)

ఇస్లాంకోరే కుటుంబ వ్యవస్థ గురించి తెలుసుకుంటున్నప్పుడు ఈ పవిత్ర వాక్యం ప్రత్యేకతను మనం గుర్తించాలి, ఇందులో అక్కాబావా, బాబాయి పిన్ని, పెద్దమ్మ పెదనాన్నలే కాకుండా తండ్రీ కొడుకులు, తల్లీ, సోదరుల నివాసాలు కూడా వేర్వేరుగా నిర్ధారించబడ్డాయి. ఈ పవిత్ర వాక్యంలో ప్రతిచోటా ఇళ్ళ తో సంబంధంకలిగిన వ్యక్తులను వేర్వేరుగా సంబోధించడం జరిగింది. ఈ అత్యంత సమీప బంధుత్వాల్లో ప్రతి ఒక్కరి నివాసం దానిక్కావలసిన సకల సౌకర్యాలతో వేరుగా ఉండాలన్న స్పష్ట మైన సూచనలు ఉన్నాయి.

ఒక ప్రధాన సామాజిక అంశం

ఈ ఉపదేశక్రమంలోనే పవిత్రఖురాన్ ఒక ప్రధాన మైన లోపాన్ని ఎత్తి చూపింది. సాధారణంగా ఇంట్లో పరాయివారు, మనతో సంబంధం లేని వారు ఉంటే ఇంటి వారికి ఇబ్బంది కలుగుతుంది. మొహమాటం వల్ల మనిషి ఆ విషయాన్ని వ్యక్తం చేయలేకపోయినప్పటికీ ఈ కారణంగా ఒకవిధమైన అసౌకర్యానికి, మానసిక సంఘర్షణకు లో నవుతాడు. మానసిక క్షోభను అనుభవిస్తాడు. దైవప్రవక్త (సల్లం) నైతికతలో ఎంతటి శ్రేష్ఠులో అందరికీ తెలిసిందే, ఖురాన్ హదీసుల పుటలన్నీ దైవప్రవక్త శ్రేష్ఠ నైతికతను ఎలుగెత్తి చాటుతున్నారు. అయినప్పటికీ పవిత్ర ఖురాన్ ఆయనగారి

స్వవిషయ వాస్తవాలను స్పష్టమైన పదాల్లో వ్యక్తం చేసింది. అలాంటప్పుడు ఉమ్మత్ లోని సాధారణ వ్యక్తులను గురించి ప్రత్యేకించి చెప్పుకునేదే ముంటుంది? ఈ విషయాన్ని మనం చాలా సులభంగా అర్థం చేసుకోవచ్చు. మానవ మహోపకారి ముహమ్మద్(స) ఎంత పేదరిక జీవితం గడిపినప్పటికీ తన బంధుమిత్రులకు తప్పనిసరిగ్గా నిరాటంకంగా విందుభోజనాలు ఏర్పాటు చేస్తూనే ఉండేవారు. చాలామంది వంట పూర్తి కాకముందే ప్రవక్త ఇంటికి వచ్చేసి పిచ్చాపాటి మాట్లాడుకుంటూ కూర్చొనే వారు. దైవప్రవక్త తన సద్వర్తనం, మోహమాటం కారణంగా వారిని ఏమీ అనే వారు కాదు. అహ్జాబ్ సూరాలో పరదా ఆదేశాలకు పూర్వం ఈ విషయం ప్రస్తావించబడింది.

> **"విశ్వసించిన ప్రజలారా! అనుమతిలభించనంత వరకూ దైవప్రవక్త ఇళ్ళలోకి ప్రవేశించకండి. (అనవసరంగా) అక్కడ మాట్లాడుతూ ఉండకండి. ఒక వేళ మిమ్మల్ని భోజనానికి పిలిస్తే మీరు నిరభ్యంతరంగా వెళ్ళవచ్చు. అయితే భోజనం చేయగానే అక్కణ్నించి లేచి వెళ్ళిపోండి, అంతేగాని అక్కడే కబుర్లు చెప్పుకుంటూ కూర్చోకండి. ఈ వైఖరి ప్రవక్తకు బాధకలిగించవచ్చు. ఆయన బిడియం, మోహమాటం వల్ల మిమ్మల్ని ఏమీ అనలేడు. దైవం యదార్థం చెప్పడానికి ఏమాత్రం సిగ్గు పడడు."** (అహ్జాబ్.53)

ఖురాన్ ఈ వాక్యం కేవలం దూరప్రాంతం వారికి మాత్రమే వర్తించే విషయం కాదు. స్వయంగా ఆయన (సల్లం) కుటుంబీకులు, బంధువులందరికీ ఈ ఆదేశం వర్తిసుంది. ఉమ్మడి కుటుంబంగా ఒకే ఇంట్లో ఉంటూ ఉదయం సాయంకాలాలు ఒకరికొకరు తారసపడే బంధువులందరూ ఈ ఆదేశం పరిధిలోకి వస్తారు. ఈ ఇబ్బంది నుండి రక్షించబడే శాశ్వతమార్గం నివాసాలు వేర్వేరుగా, చిన్నవిగా ఉండడం మాత్రమే.

ఆదాయ విభజనకు సంబంధించిన కొన్ని కోణాలు

అనాథల, బలహీన వర్గాల హక్కులు

అనాథలు, బలహీన వర్గాల హక్కులు విషయంలో ఇస్లాం ప్రత్యేక శ్రద్ధవహిస్తుంది. అనాథల సొమ్మును అతనికి అప్పగించకుండా, తన సొమ్ముతో కలిపేసు కొని కాజేయడాన్ని పాపంగా పరిగణించింది (నిసా.2) "ఒక వేళ అనాథలు ప్రాజ్ఞులుకాని వారైతే పెళ్ళీడు వచ్చేవరకు వారిస్థితి గతులు గమనిస్తూ ఉండండి. ఆతర్వాత వారిలో తగిన అర్హతలు ఉన్నాయని మీకు అనిపిస్తే వారి ఆస్తిని వారికి అప్పగించండి. సాక్షుల్ని పెట్టుకొమ్మని కూడా చెప్పబడింది." (నిసా. 5,6)

ఉమ్మడి కుటుంబంల్లోనైతే ఈ హితవుల్ని పాటించడం అసాధ్యం అనాథల సొమ్మును వేరుగా ఉంచి సంరక్షించడం, ఉమ్మడి కుటుంబాల్లో ఆచరణ సాధ్యంకాని విషయం.

అనాథల సొమ్మును వాడుకునే విషయమై ఖురాన్ మరో సందర్భం లో ఇలా పేర్కొంది పెద్దగా ఇబ్బంది లేదనుకుంటే వారి వ్యవహారాలను వేరుగా ఉంచడమే మంచిది. అంతకూ తప్పనిసరి పరిస్థితులు ఎదురైై వారి సొమ్ము వాడవలసి వస్తే అత్యంత నిజాయితీగా వ్యవహరించాలి. వారి సొమ్మును అనవసరంగా, దుబారా ఖర్చు చేయరాదు.' ఎవరైతే అనాథల సొమ్మును కాజేస్తారో, లేక అధర్మంగా ఖర్చుపెడతారో వారిపై శాపం ఉంది'.

సంపాదనా మార్గాలు

ఇస్లాంలో సంపాదనా మార్గాలు మూడు ఉన్నాయి. మనిషితను సొంతంగా సంపాదించింది, వారసత్వంలో లభించింది, లేక కానుకగా, బహుమానంగా ఎవరైనా ఇచ్చింది. ఇవికాక ఎవరైనా ఎవరిసొమ్మునైనా వాడుకోవడం అధర్మం, ఇది అన్యాయంగా వాడుకున్న పద్ధతి కిందికి

వస్తుంది. దీన్ని ఖురాన్ గ్రంథం కఠినమైన పదజాలంతో వారించింది. దీన్ని ఆత్మ హత్య, ఆత్మను చంపుకోవడంతో పోల్చింది. దీనివల్ల ఇది ఎంత పెద్ద తప్పిదమో, దుర్మార్గమో మనకు స్పష్టంగా అర్థమవుతోంది. ఉమ్మడి కుటుంబాల్లో కేవలం సనాతన ఆచారం ప్రకారం అని చెప్పి ఒక విధానమూ, ఒక నియమమూ, నిర్ణయమూ లేకుండా ఇంటి ఆర్థిక వ్యవహారాలన్నీ కలగాపులగమై మిశ్రమంగా కొనసాగు తుంటాయి. దీనిలో కొందరు ఎప్పుడూ దొడ్డి దారిన సొమ్ము కాజేయడానికి పొంచి ఉండి మార్గాలు వెదకడంలో నిమగ్నమై ఉంటారు.

ఈవిధంగా చూసినప్పుడు నిసా సూరాలోని 29,30. ఆయత్‌లు ముస్లిం సమాజాన్ని జాగృతం చేయడానికి సరిపోతాయి.

గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే, ఇస్లాం దృష్టిలో ఎదిగిన కొడుకు తండ్రినుండి వేరై సమాజంలో గౌరవనీయమైన, స్థిరమైన స్థాయి కల వ్యక్తిగా రూపొందుతాడు. విశాలమైన, స్థిరమైన స్థాయి కల వ్యక్తిగా రూపొందు తాడు. విశాలమైన ఉమ్మడికుటుంబంలోని వివిధ సోదరులు, దాయాదులు బాబాయి కొడుకులు మొదలైన వారు కూడా అలాగే రూపొందుతారు. వీరు పెద్దవారై, ప్రాజ్ఞులై వివాహాలు జరిగి పోతే వారిని వారి ఇల్లు వాకిలితో పాటు వారి ఆర్థిక వ్యవహారాలు కూడా ఒకరికొకరు సంబంధం లేకుండా వేరుగా ఏర్పాటు జరగాలి. వారి మిశ్రమ ఆదాయంలో ఏమైనా అవకతవకలు ఉన్నట్లయితే అది ఖురాన్ హితవుల ప్రకారం ఆ సంపదను అధర్మంగా తినడంగా పరిగణించడం జరిగింది. ముస్లింల సంప్రదాయం దీన్ని ఎట్టి పరిస్థితుల్లోను సమ్మతించదు, ధర్మంగా పరిగణించదు.

ఒక సందేహ నివృత్తి

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ (Joint family system)కు భిన్నంగా

ఇస్లాంకోరే కుటుంబ వ్యవస్థ స్వరూపాన్ని పై పేరాల్లో మేము వివరించాము. ప్రత్యేకించి భారత ఉపఖండ నేపధ్యంలో ఒక సందేహం, ఒక అపోహ తలెత్తే అవకాశం ఉంది. ఈ అపోహను దూరం చేయడం చాలా అవసరం అని భావిస్సున్నాము. అదేమిటంటే, అ విషయం ముస్లిం సమాజాన్ని స్వార్థ పరత్వం, స్వలాభాల అగాథాల్లోకి నెట్టేస్తుందని ఎవరైనా అనవచ్చు. సమాజం లోని ప్రతి వ్యక్తి తనదితానే చూసుకుంటాడు. తన స్వార్థం పరమావధిగా భావిస్తాడు తప్ప ఇతరుల్ని గురించి పట్టించుకోడు అనవచ్చు. కాని వాస్తవం ఏమిటంటే, మన ప్రియప్రవక్త సల్లం ఈ విధమైన వ్యవస్థను ఆచరించి మానవాళికి అందరికంటే ఎక్కువ మహోపకారిగా, పరుల అవసరాలను తన అవసరాలుగా భావించే దయాళువుగా, ప్రతి ఒక్కరి హక్కును సంపూర్ణంగా నెరవేర్చగలిగారు. ఈ విషయం జగద్వితం. మరి ఇలాంటప్పుడు ఆయన అనుచరులకు ఈ మార్గం పై నడుస్తూ, ఆ విధానాన్ని అనుసరించే విషయంలో అవరోధాలు, దుష్కార్యాలు ఎదురయ్యే అవకాశాలే లేవు. వేర్వేరు నివాసాలు సమాజ శ్రేయస్సు కోసం, సౌలభ్యం కోసం మాత్రమే కాని తల్లిదండ్రులు, అన్నదమ్ములు అక్క చెల్లెళ్ళు, బంధుమిత్రులు బాగోగులను విస్మరించడానికి అని ఎలా అనుకుంటారు? ఈ ఆలోచనకు అసలు అవకాశం ఎక్కడుంది?

ఇస్లాం దృష్టిలో తల్లి దండ్రులు, బంధుమిత్రులతో సత్ప్రవర్తన కలిగి ఉండడం మనిషి నైతిక బాధ్యత మాత్రమే కాకుండా చట్టపరమైన బాధ్యత కూడా! శారీరక సేవ ఆర్థిక సహాయం సహకారాలు ఇవన్నీ ఈ సత్ప్రవర్తన లోనే ఇమిడి ఉన్నాయి. బంధువులు ప్రత్యేకించి రక్త సంబంధీకుల్లో సోదరులు సోదరీమణులు, పిన్ని, మేనల్లుడు మొదలగు వారితో సత్ప్రవర్తన కలిగిఉండడం అన్ని రకాలుగా వారి బాగోగులు చూసుకోవడం, ఇస్లామీయ భోదనల్లో అత్యంత ప్రాముఖ్యం కలిగిన ప్రకరణలు. రక్త సంబంధాలను గౌరవించని వారిని అల్లాహుతాలా తనకు దూరంగా ఉంచుతాడు. (బుఖారి, 2వ సం॥ అదబ్ అద్యాయం) ఇలాంటి వ్యక్తి స్వర్గ ప్రవేశానికి

దూరంగా ఉంచబడతాడు (బుఖారి, 2వ అధ్యాయం డిటో) చివరికి ఇలాంటి వారి అశుభాలతో జాతి మొత్తం దైవకారుణ్యానికి దూరమయ్యే అవకాశం ఉంది. (బైహఖీ ఫీ షఅబ్ అలా ఈమాన్ బ హవాలా మిష్కాత్)

ధర్మంలో ఏ విషయానికైతే ఇంతటి ప్రాముఖ్యత ప్రాధాన్యత ఇవ్వబడిందో దాన్ని విస్మరించడానికి, చూసీచూడనట్లు వదిలేయడానికి ఆస్కారమెక్కడుంది అన్న విషయం దీంతో మనకు స్పష్టమైంది. కుటుంబాల విభజన, చిన్నచిన్న కుటుంబాల లక్ష్యం, ముందే వివరించినట్లు ఇతర ధార్మిక అవసరాల పరిపూర్తికి మాత్రమే. వీటిని ఉమ్మడి కుటుంబాల్లో పూర్తి చేసే అవకాశాలు శూన్యం. చివరికి వివాహానంతరం భార్య అభీష్టం, పరస్పర ఏకాభిప్రాయంతో భర్త తన తల్లిదండ్రులను, చిన్న వాళ్ళైన తన తమ్ముళ్ళను తన ఇంట్లోనే ఉంచుకోవచ్చు. ఉమ్మడి కుటుంబ రుగ్మతల నుండి రక్షించబడుతూ, శాంతి, సంతృప్తుల జీవితం గడపవచ్చు.

మరో విషయం ఏమిటంటే భారతదేశ ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో ఇస్లాం కోరేకుటుంబ వ్యవస్థను వెంటనే అమలుపరచడం సాధ్యంకాదు. అందుకని షరియత్ ఏవిధానాన్ని, ఏక్రమాన్నయితే ప్రతి సందర్భంలో, ప్రతిచోటా దృష్టిలో ఉంచుకుందో, దాని దృష్ట్యా ఉమ్మడి కుటుంబవ్యవస్థ మార్పుల్లో కూడా దీన్ని దృష్టిలో ఉంచుకోవాలి, ప్రత్యేక పరిస్థితుల్లో అధర్మంగానైనా దీనికోసం అనుమతి లభిస్తే ఏదో ఒక స్థాయిలో ఈ విషయం గురించి ఆలోచించవచ్చు. అయితే ఒక విషయాన్ని బలవంతంగా నైనా కొన్ని వ్యూహాల ప్రకారం తాత్కాలికంగా నైనా అంగీకరిస్తే ఒక గొప్ప మార్పును మనం చూడగలం, సకల శుభాలతో అలరారే ఒక చక్కని ఆదర్శవంత మైన సమాజాన్ని మనం వీక్షించగలం. ఇదీ ఈ రెండిటిలో ఉన్నటువంటి పెద్ద తేడా!.

-: సమాప్తం :-